
సాక్షి
పల్నాడు
సోమవారం । 10 । ఫిబ్రవరి । 2025



నీలకంఠేశ్వరస్వామి కల్యాణం

అచ్చంపేట: భీష్మ ఏకాదశిని పురస్కరించుకుని స్థానిక శ్రీ సర్వమంగళా సమేత నీలకంఠేశ్వరస్వామి దేవాలయంలో శనివారం రాత్రి కల్యాణం నిర్వహించారు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: సాగర్ జలాశయ నీటి మట్టం ఆదివారం 544.90 అడుగుల వద్ద ఉంది. జలాశయం నుంచి కుడి కాలువకు 10,040 క్యూసెక్కులు విడుదలవుతోంది.



వైభవంగా స్వామి వారి కల్యాణం

నగరంపాలెం: గుంటూరు బ్రాడీపేటలోని గౌరీ విశ్వేశ్వరాలయంలో ఆదివారం స్వామి వారి జన్మ నక్షత్రం పురస్కరించుకుని కల్యాణం వైభవంగా నిర్వహించారు.

కూలిన బతుకులు

మరో పది నిమిషాల్లో ఇంటికి చేరుకునేలోపే నిండు ప్రాణాలు గాలిలో కలిసిపోయాయి. తొందరగా వెళ్లాలనే ఆతృత కుటుంబాలను ఛిన్నాభిన్నం చేసింది. పూట గడవటం కష్టంగా ఉండటంతో కుటుంబాన్ని పోషించుకునేందుకు నిత్యం కూలీ పనులకు ఆటోలో వెళుతున్న వారిని ట్రాక్టర్ రూపంలో మృత్యువు వెంటాడింది. నిండు కుటుంబాలలో విషాదం నింపింది.

- కూలీ పనులకు వెళ్లి తిరిగి రాని లోకాలకు ప్రయాణం
- బొల్లవరం సమీపంలో తిరగబడ్డ ట్రాక్టర్
- ప్రమాదంలో నలుగురు మృతి
- మరో 16 మందికి స్వల్ప గాయాలు
- మృతులంతా చాగంటివారిపాలెం వాసులు
- గ్రామంలో విషాద ఛాయలు



ప్రమాద స్థలంలో తిరగబడిన ట్రాక్టర్

చాగంటివారిపాలెం(ముప్పాళ్ల): మండలంలోని చాగంటివారిపాలెం గ్రామానికి చెందిన 43 మంది వ్యవసాయ కూలీలు ఆదివారం ఉదయం బొల్లవరం గ్రామ సమీపంలోని మాదల మేజర్ మీదుగా అదే గ్రామానికి చెందిన కౌలు రైతు ముప్పా శ్రీకాంత్ పొలానికి మిర్చి కోతలకు వెళ్లారు.పనులు ముగియడంతో తెచ్చుకున్న అన్నం బాక్స్‌లు, కోసిన మిర్చి బస్తాలతో సాయంత్రం ఇంటికి బయలుదేరారు. ఇందులో ఇరవై మూడు మంది ఆటోలో గ్రామానికి చేరారు. మిగిలిన ఇరవై మంది ఆటో కోసం వేచి ఉండలేక, చీకటి పడుతుందనే తొందరతో మిర్చి గోతాల కోసం వచ్చిన ట్రాక్టర్‌ను ఎక్కారు. బొల్లవరం మేజర్ కట్టపై వస్తుండటంతో మెల్లగా వెళ్లమంటూ డ్రైవర్‌కు చెప్పారు. కాల్వ కట్టపై పెద్దపెద్ద గుంతలు ఉండటంతో తప్పించే క్రమంలో టైర్ అదుపు తప్పి పొలంలోకి జారింది. ట్రాక్టర్ డోర్లు తెరిచి ఉండటం, అందరూ ఒక వైపు కూర్చొని ఉండటంతో అదుపుతప్పి ఒక్కసారిగా ట్రాక్టర్, ట్రక్కు బోల్తా పడ్డాయి. మిర్చి టిక్కీలపై కూర్చున్న కూలీలలో కొంతమంది దూరంగా ఎగిరి పడ్డారు. ట్రాక్టర్ బానెట్‌పై కూర్చొన్న మధిర సామ్రాజ్యం (65), తేనేపల్లి పద్మ(48) టైర్ కింద పడి ఊపిరి ఆడక అక్కడికక్కడే ప్రాణాలు విడిచారు. లోపల కూర్చున చక్కెర మాధవి(30), మధిర గంగమ్మ(55)పైన మిర్చి టిక్కీలు, ట్రక్కు పడటంతో ఊపిరాడకపోవడంతో ప్రాణాలు వదిలారు. డ్రైవర్ ప్రమాదం నుంచి తప్పించుకొని సురక్షితంగా బయటపడ్డాడు. దూరంగా పడిన కూలీలు ఫోన్‌లో గ్రామస్తులకు సమాచారం అందించారు. హుటాహుటిన కొంతమంది యువకులు సంఘటనా స్థలానికి చేరి జేసీబీ సాయంతో ట్రాక్టర్‌ను పైకి లేపి, మృతదేహాలను బయటకు తీశారు. మిర్చి గోతాలు పడి ట్రాక్టర్ కిందే ఉన్న తురకా వెంకటలక్ష్మిని బయటకు లాగడంతో ప్రాణాలతో బయట పడింది. మిగిలిన 15 మంది గాయాలతో బయట పడ్డారు.

అదృష్టవంతురాలు లక్ష్మి



తురకా వెంకటలక్ష్మి

ట్రాక్టర్ ప్రమాదంతో ప్రాణాలతో బయటపడిన తురకా వెంకటలక్ష్మి కుటుంబానికి ఆసరాగా ఉంటూ నరసరావుపేటలోని ప్రైవేట్ కళాశాలలో డిగ్రీ ఫైనలియర్ చదువుతోంది. ఆదివారం కావడంతో తోటి వారితో కలిసి మిర్చికోతకు వెళ్లింది. పనులు ముగించుకొని ట్రాక్టర్‌పై ఇంటికి వస్తూ ప్రమాదంలో స్వల్ప గాయాలతో బయటపడింది. ఆమె రెండు వైపులా ఉన్న ఇద్దరు ప్రమాదంలో మృతి చెందగా, మిర్చి టిక్కీలు పైన పడటంతో ప్రమాదం నుంచి తప్పించుకోగలిగింది. యువతిని కుటుంబ సభ్యులంతా లక్కీ అని పిలుస్తుంటారు. ఈ సంఘటనలోనూ లక్కీగానే ప్రమాదం నుంచి బయటపడి ప్రాణాలు కాపాడుకుంది.

రెక్కాడితే గాని డొక్కాడని కుటుంబం

ప్రమాదంలో మృత్యువాత పడ్డ తేనేపల్లి పద్మది రెక్కాడితే గాని డొక్కాడని కుటుంబం. భర్త శ్రీనివాసరావు కార్పెంటర్. పద్మ నిత్యం వ్యవసాయ కూలీ పనులకు వెళ్తుంటుంది. రోజు లాగా అందరితో కలిసి ఆటోలో కూలీ పనులకు వెళ్లింది. మృతి వార్త తెలుసుకున్న కుమారుడు సాయి, భర్త శ్రీనివాసరావు రోదిస్తున్న తీరు కంట తడి పెట్టించింది.

అమాయకంగా చిన్నారులు

గ్రామానికి చెందిన చక్కెర మాధవి రోజూ లాగే మిర్చి కోతకు వెళ్లి ట్రాక్టర్ తిరగబడిన ప్రమాదంలో మృతి చెందింది. ప్రమాదం జరిగిందని తెలుసుకున్న భర్త సుధాకర్‌రెడ్డి భార్య కోసం సంఘటనా స్థలానికి వెళ్లారు. కొన ఊపిరితో ఉన్న మాధవిని ఆసుపత్రికి తీసుకెళ్తుండగా మార్గంమధ్యలోనే మృతి చెందింది. అది తెలియని మాధవి కుమారులు నాగేశ్వరరెడ్డి, లోకేశ్వరరెడ్డి ఇంటి ముందే కూర్చొని అమ్మ కోసం ఎదురు చూస్తుండటం స్థానికులను కంటతడి పెట్టించింది. కుమారులలో పెద్దవాడైన నాగేశ్వరరెడ్డి స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏడో తరగతి, చిన్నవాడు లోకేశ్వరరెడ్డి ఆరో తరగతి చదువుతున్నాడు. భర్త సుధాకరరెడ్డి సత్తెనపల్లి ఏరియా వైద్యశాలలోని భార్య మృతదేహం వద్ద రోదిస్తూ ఉన్న తీరు కలచివేసింది.

అమ్మా...ఎక్కడున్నావు ?

అమ్మా ఎక్కడున్నావు...చీకటి పడింది...త్వరగా ఇంటికి రా అంటూ ప్రమాదంలో మృతి చెందిన మధిర సామ్రాజ్యం చిన్న కుమార్తె పద్మ రోదిస్తున్న తీరు స్థానికులను కంట తడి పెట్టించింది. ఇద్దరు కుమార్తెలకు వివాహాలు కాగా, చిన్న కుమార్తె చాగంటివారిపాలెంలోనే తల్లికి తోడుగా ఉంటోంది. మృతి వార్త తెలుసుకొన్న పద్మ ఇంటి వద్ద రోదిస్తున్న తీరు అందరినీ కలచివేసింది. ఆమె స్పృహ తప్పి పడిపోవటంతో స్థానికులు సపర్యలు చేస్తున్నారు.

ఆసుపత్రికి తరలింపు

ప్రమాదంలో స్వల్ప గాయాలతో బయటపడిన వారిని స్థానికులు నరసరావుపేట, సత్తెనపల్లిలోని ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. మరికొంతమంది గ్రామంలోనే ఆర్ఎంపీ వద్ద చికిత్స చేయించుకున్నారు. వీరిలో కళ్లం లక్ష్మికి చెవి, చేతి పైన గాయాలయ్యాయి. మెరుగైన చికిత్స కోసం నరసరావుపేటకు తరలించారు.

మృతదేహాల తరలింపు

సమాచారం అందుకున్న సత్తెనపల్లి డీఎస్పీ హనుమంతరావు, రూరల్ సీఐ, ఎస్ఐ వి.సోమేశ్వరరావు సంఘటనా స్థలానికి చేరి ప్రమాదంలో మృతి చెందిన వారి వివరాలు నమోదు చేసుకున్నారు. మృతదేహాలను ట్రాక్టర్‌లో పోస్టుమార్టం నిమిత్తం సత్తెనపల్లి ఏరియా వైద్యశాలకు తరలించారు. ప్రమాద వార్త తెలుసుకున్న పల్నాడు జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావు సంఘటనా స్థలానికి వెళ్లి వివరాలు అడిగి తెలుసుకున్నారు. గాయపడిన వారి వివరాలు తెలుసుకొని వారికి మెరుగైన చికిత్స అందించాలని సూచించారు.



సామ్రాజ్యం ఇంటి వద్ద రోదిస్తున్న కుమార్తె పద్మ

ప్రమాదంలో మృతులు



సామ్రాజ్యం (ఫైల్)



చక్కెర మాధవి (ఫైల్)



తేనేపల్లి పద్మ (ఫైల్)



గంగమ్మ (ఫైల్)

ఒక్కసారిగా తిరగబడింది



అందరూ పనులు ముగించుకొని ఆటోలో ఖాళీ లేకపోవడంతో మిరప గోతాలతో ట్రాక్టర్‌లో బయలు దేరాం. కొద్ది దూరం రాగానే గుంత ఉండటంతో కేకలు వేశాం. మెల్లగానే వెళుతున్నప్పటికీ ఒక్కసారిగా ట్రాక్టర్ తిరగబడింది. ఏం జరుగుతుందో కూడా తెలియలేదు. మేమంతా ఎగిరి దూరంగా పడ్డాం. బానెట్ పైన కూర్చున్న ఇద్దరు ట్రాక్టర్ టైరు కింద పడి పోయారు. చిన్న దెబ్బలతో బయటపడ్డా.

-మధిర రత్తమ్మ, చాగంటివారిపాలెం

న్యూస్‌రీల్

డీఆర్‌డీఏ పీడీ ప్రభుత్వానికి సరెండర్



నరసరావుపేట: జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ (డీఆర్‌డీఏ) పీడీ బాలూనాయక్‌ను ప్రభుత్వానికి సరెండర్ చేస్తూ కలెక్టర్ పి.అరుణ్‌బాబు శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. అమరావతి, అచ్చంపేట మండలాల్లో మంజూరు చేసిన వెలుగు రుణాల్లో భారీఎత్తున అవకతవకలు జరిగాయనే ఆరోపణలపై ఈ మేరకు నిర్ణయం తీసుకున్నట్లు తెలిసింది. అమరావతి మండలంలో కోటి రూపాయలకు పైగా వెలుగు రుణాలు పక్కదారి పట్టడమే గాకుండా, అవినీతికి పాల్పడిన ఉద్యోగులకు అండగా ఉండటం, కింది స్థాయి సిబ్బందిని వేధింపులకు గురి చేయడం తదితర ఆరోపణలపై చర్యలు తీసుకున్నారు. బాలూనాయక్ మూడేళ్లుగా కలెక్టరేట్‌లో విధులు నిర్వహిస్తున్నారు. ఆయన నుంచి వివరణ తీసుకునేందుకు ప్రయత్నించగా అందుబాటులోకి రాలేదు.

నేడు పీజీఆర్ఎస్ రద్దు

నరసరావుపేట: గుంటూరు, కృష్ణా జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలను పురస్కరించుకొని అమలవుతున్న ఎన్నికల కోడ్ నేపథ్యంలో సోమవారం కలెక్టరేట్, జిల్లా ఎస్పీ కార్యాలయాల్లో ప్రజాసమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)ను రద్దు చేసినట్లు కలెక్టర్ పి.అరుణ్‌బాబు, ఎస్పీ కె.శ్రీనివాసరావు ఆదివారం వేర్వేరు ప్రకటనల్లో పేర్కొన్నారు. జిల్లా ప్రజలు గమనించాలని వారు కోరారు.

మద్యం దుకాణాల కేటాయింపు లాటరీ వాయిదా

నెహ్రూనగర్: ప్రభుత్వం గీత కులాలకు గుంటూరు జిల్లాలో కేటాయించిన 13 మద్యం షాపులకు లైసెన్స్‌ల జారీకి దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ 8వ తేదీతో ముగిసింది. ఎన్నికల కోడ్ కారణంగా సోమవారం జరగాల్సిన లాటరీ ప్రక్రియ నిరవధికంగా వాయిదా పడింది. ఉమ్మడి గుంటూరు, కృష్ణా జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ కారణంగా ఈ ప్రక్రియను వాయిదా వేసినట్లు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ డెప్యూటీ కమిషనర్ డాక్టర్ కె. శ్రీనివాస్ తెలిపారు. మొత్తం 233 మంది దరఖాస్తు చేసుకున్నారు. తద్వారా డిపాజిట్ల రూపంలో ప్రభుత్వానికి రూ.4.66 కోట్లు ఆదాయం సమకూరింది.

నేడు నామినేషన్ దాఖలుకు తుది గడువు


లక్ష్మీపురం: ఈ నెల 27వ తేదీన జరగనున్న ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి నామినేషన్ దాఖలుకు తుది గడువు సోమవారం మధ్యాహ్నం 3 గంటలతో ముగినుంది. ఈ మేరకు సహాయ రిటర్నింగ్ అధికారి డీఆర్ఎం షేక్ ఖాజావలి ఆదివారం తెలిపారు. జిల్లా పరిధిలో ఈ ఎన్నికలకు సంబంధించిన ఫిర్యాదుల కోసం కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. కంట్రోల్ రూమ్‌ను 0863-2241029 నెంబరులో సంప్రదించాల్సిందిగా సూచించారు.

ఒక్క మాత్రతో నులిపురుగుల నివారణ



గుంటూరు మెడికల్ : జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమం జిల్లా వ్యాప్తంగా సోమవారం జరుగుతుందని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ కొర్రా విజయలక్ష్మి తెలిపారు. ఒకే ఒక్క మాత్రతో పిల్లల కడుపులో ఉండే నులిపురుగులను నివారించవచ్చన్నారు. కార్యక్రమంలో ఏడాది నుంచి 19 సంవత్సరాల పిల్లలందరికి తప్పనిసరిగా నులిపురుగుల నిర్మూలన కోసం మధ్యాహ్నం భోజనం తర్వాత గంట తేడాతో 400 ఎంజీ ఆల్బెండజోల్ బిళ్లలను వారితో చప్పరింపజేసి, మింగించాలని తెలిపారు. ఏడాది నుంచి రెండేళ్ల పిల్లలకు అర మాత్ర, 2 నుండి 19 సంవత్సరాల పిల్లలకు పూర్తి మాత్ర ఇవ్వాలని వెల్లడించారు. సోమవారం ఇవ్వని వారికి ఈ నెల 17న జరిగే మాపప్ రౌండ్‌లో ఇవ్వాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి ఆదేశించారు.

సాగునీటి సమాచారం



తాడేపల్లిరూరల్ (దుగ్గిరాల): కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద ఆదివారం 1818 క్యూసెక్కులు విడుదల చేశారు. బ్యాంక్ కెనాల్‌కు 156, తూర్పు కెనాల్‌కు 142, పశ్చిమ కెనాల్‌కు 125, నిజాంపట్నం కాలువకు 80, కొమ్మమూరు కాలువకు 870 క్యూసెక్కులు విడుదల చేశారు.

రైతులపై భూ సేకరణ పిడుగు!



డిసెంబర్‌లో భూసేకరణను వ్యతిరేకిస్తూ తాడికొండ గ్రామ సభలో తీర్మానం చేస్తున్న రైతులు (ఫైల్)

- అమరావతి రైల్వే లైన్ భూసేకరణపై రైతులు ఆగ్రహం
- భూ సమీకరణ మాత్రమే చేయాలని డిమాండ్
- రాష్ట్రంలో అన్ని ప్రాంతాల్లో రిజిస్ట్రేషన్ విలువలు పెంపు
- అమరావతి పరిసర ప్రాంతాల్లో మాత్రం ప్రభుత్వం మొండిచేయి
- రైల్వే ఇచ్చే పరిహారం చాలా తక్కువవొస్తుందని ఆందోళన
- రైతుల అభ్యంతరాలు స్వీకరించకుండా పెగ్ మార్కింగ్‌కు సిద్ధం

సాక్షి ప్రతినిధి, గుంటూరు: అమరావతి రైల్వే లైన్ కోసం గుంటూరు జిల్లాలో 1,753 ఎకరాల భూమి సేకరించాల్సి ఉంది. అమరావతి మండలం కర్లపూడి గ్రామంలోనే 232 ఎకరాలు సేకరించనున్నారు. ఇదే గ్రామంలో ఇన్నర్ రింగ్ రోడ్డు కోసం 153 ఎకరాలు, ఈ7, ఈ8, ఈ9 రోడ్లు, ఔటర్ రింగ్ రోడ్డు కోసం 900 ఎకరాలు కోల్పోవాల్సి వస్తోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పుడు రైల్వే లైన్‌కు భూమి ఇవ్వాలని అడుగుతున్నారని, దీనికి కేంద్రం ఇచ్చే ప్యాకేజీ సరిపోదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. విమానాశ్రయం కోసం ఎక్కడో ఉన్న గన్నవరంలో భూములిచ్చిన వారికి రాజధానిలో 1,450 గజాలు ల్యాండ్‌పూలింగ్ ప్యాకేజీ కింద ఇచ్చారని, తమకు మాత్రం ఇవ్వకపోవడం ఏంటని వారు ప్రశ్నిస్తున్నారు.

ఇంత అన్యాయమా?

ఇటీవల రాష్ట్రవ్యాప్తంగా భూముల ప్రభుత్వ విలువ పెంచిన రాష్ట్ర ప్రభుత్వం అమరావతి రాజధాని, పరిసర ప్రాంతాల్లో మాత్రం పెంచలేదు. ఇదేం అన్యాయమని రైతులు ప్రశ్నిస్తున్నారు. దీని వల్ల రైల్వే లైన్ భూ సేకరణలో తాము తీవ్రంగా నష్టపోతామని చెబుతున్నారు. తమ గ్రామంలో భూమి ప్రభుత్వ విలువ ఎకరం రూ. 16 లక్షలు ఉంటే.. దానిపై కేవలం రూ. 4 లక్షలు మాత్రమే పెంచారని, మిగిలిన చోట్ల అసలు పెంచలేదని కర్లపూడి రైతులు చెబుతున్నారు. బహిరంగ మార్కెట్‌లో తమ భూముల ఎకరా దాదాపు రూ. 4 కోట్లు ఉండగా, ఇప్పుడు రైల్వే నుంచి రూ. 50 లక్షలు కూడా రావని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరోపక్క రైల్వే ప్యాకేజీకి అదనంగా ల్యాండ్ పూలింగ్‌లో ఇచ్చే ప్యాకేజీలో 33 శాతం అంటే 410 గజాల స్థలం ఇప్పిస్తామని మంత్రి నారాయణ ఇటీవల రైతులకు సర్దిచెప్పారు. కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ 650 గజాల వరకు ఇప్పించడానికి ప్రయత్నిస్తానని చెప్పారు. అయితే. దీనికి కూడా రైతులు అంగీకరించడం లేదు. పూర్తిగా పూలింగ్ ప్యాకేజీ ఇవ్వాలని కోరుతున్నారు. రాజధాని రైతులకు ఇచ్చినట్లుగా ఫారం.9.14 ఇవ్వాలని, అందులో ఎంత భూమి ఇస్తారు, ఇళ్ల స్థలం ఎంత, వాణిజ్య స్థలం ఎంత, కౌలు ఎన్ని సంవత్సరాలు ఇస్తారన్న విషయాలను స్పష్టం చేయకుండా భూములు ఇచ్చేది లేదని వారు చెబుతున్నారు. అసలు రైల్వే లైన్ అలైన్‌మెంటే తప్పు అని రైతులు అంటున్నారు. ల్యాండ్ పూలింగ్ చేసిన గ్రామాల నుంచి కాకుండా బయట నుంచి రైల్వే లైన్ వెళ్లడం వల్ల 4 కిలోమీటర్ల దూరం పెరుగుతుందని వాదిస్తున్నారు. గతంలో ఇచ్చిన మాస్టర్ ప్లాన్‌ను కదపకుండా బయట నుంచి అలైన్‌మెంట్ ఇచ్చామని మంత్రి నారాయణ చెబుతున్నారు.

పెగ్ మార్కింగ్ ఎలా చేస్తారు?

ప్రభుత్వం రైతులతో సమావేశాలు పెట్టినా, వారి అభ్యంతరాలు స్వీకరించకుండానే రైల్వే లైన్ భూసేకరణకు పెగ్ మార్కింగ్‌కు సిద్ధపడుతోంది. ఇలా ఇష్టానుసారం పెగ్ మార్కింగ్‌కు షెడ్యూల్ ప్రకటించడంపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సోమవారం అమరావతి తహసీల్దార్‌తో జరిగిన సమావేశంలో కర్లపూడి రైతులు ఇదే విషయాన్ని చెప్పారు. పోలీసు బందోబస్తుతో పెగ్‌మార్కింగ్‌కు రావడానికి అధికారులు సన్నాహాలు చేస్తున్నారని, ఫోన్లు చేసి బెదిరిస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. రాజధాని పరిసర ప్రాంతాల్లోని కంతేరు, కొప్పురావూరు, తాడికొండ, మోతడక గ్రామాల రైతులు రైల్వే లైన్ భూసేకరణను వ్యతిరేకిస్తూ గ్రామసభల్లో తీర్మానాలు కూడా చేశారు. రైల్వేలైన్ వల్ల పక్కన ఉన్న భూముల ధరలు కూడా పడిపోతాయని వారు ఆందోళన వ్యక్తం చేశారు. అందు వల్ల పక్కనే 500 మీటర్ల వరకూ భూమిని సేకరించి, రైల్వే లైన్‌కు రెండువైపులా సర్వీస్ రోడ్లు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

‘చీట్’ఫండ్‌తో అంతులేని వేదన

- నరసరావుపేటలో సమావేశమైన సాయిసాధన చిట్ ఫండ్స్ పుల్లారావు బాధితులు
- ఆయనకు సహకరించిన సీఐపై వేటు వేయాలని డిమాండ్
- న్యాయం చేయాలని ఎమ్మెల్యే అరవింద్‌బాబు ఇంటి వద్ద ధర్నా
- విషయాన్ని సీఎం దృష్టికి తీసుకెళతానని ఎమ్మెల్యే హామీ
- న్యాయం చేసే వరకు పోరాటం చేస్తామన్న బాధితులు



నరసరావుపేటలోని కమ్మ హాస్టల్‌లో సమావేశమైన సాయిసాధన పుల్లారావు బాధితులు



ఎమ్మెల్యే అరవింద్‌బాబు కార్యాలయం ఎదుట ఆందోళన నిర్వహిస్తున్న పుల్లారావు బాధితులు

నరసరావుపేట టౌన్: గత ఇరవై రోజులుగా పొంగుతున్న కన్నీళ్లను గుండె లోతుల్లో దాచుకుని వేదన పడుతున్న సాయి సాధన చిట్ ఫండ్స్ పాలడుగు పుల్లారావు బాధితులు రోడ్డెక్కారు. పైసాపైసా దాచుకున్న డబ్బును జల్సాలకు, కుటుంబ ఆడంబరాలకు దుబారా చేశాడని తెలిసి ఆగ్రహంతో ఊగిపోయారు. ఆదివారం రెండు వందల మందికి పైగా బాధితులు నరసరావుపేటలోని కమ్మ హాస్టల్‌లో సమావేశమయ్యారు. తాము ఎంతెంత వరకు పుల్లారావుకు అప్పులిచ్చింది ? ఎలా తమను నమ్మించి మోసగించింది ? వివరాలు తెలియజేశారు. ఎలాగైనా పుల్లారావు నుంచి నగదు మొత్తం వసూలు చేయాలని, దీనికి కలిసికట్టుగా పోరాడాలని నిశ్చయించారు. ఈ సందర్భంగా పుల్లారావుకు అప్పులిచ్చిన వారిలో కొంత మంది కలిసి ఒక కమిటీగా ఏర్పడ్డారు. పుల్లారావు ఆస్తులెంత ? అప్పులెంత ? తదితర లెక్కలు జమ కట్టాలని తీర్మానించారు. సమస్యలను ప్రభుత్వ పెద్దల వద్దకు తీసుకెళ్లి న్యాయం చేసే వరకు పోరాటం ఆపకూడదని నిశ్చయించుకున్నారు. సమావేశానికి వచ్చిన బాధితులతో నిర్వాహకులు జాబితాలను తయారు చేశారు. చీటీ పాటలకు సంబంధించి 600 మంది, వడ్డీ రూపంలో మరో 200 మంది బాధితులు ఉన్నట్టు ప్రాథమికంగా తేల్చారు. పుల్లారావు మోసాలు బయటపడ్డాక కూడా ప్రజలను మోసగించేందుకు ఆయనకు మరింతగా సహకరించిన సమీప బంధువు సీఐను వెంటనే సస్పెండ్ చేయాలని కోరారు. సమావేశం జరుగుతున్న విషయం తెలుసుకొని అక్కడికి చేరుకున్న పుల్లారావు సోదరుడు శ్రీనివాసరావును బాధితులు నిలదీశారు. పుల్లారావు ఆస్తులు, నగదు ఎంతమేరకు ఉందో చెప్పాలని డిమాండ్ చేశారు. ఆస్తులు, డబ్బుల వ్యవహారం తనకంటే ఆయనతో లావాదేవీలు జరిపిన మీకే తెలుసంటూ ఎదురు సమాధానం చెప్పాడు. దీంతో బాధితులకు, అతనికి మధ్య వాగ్వివాదం జరిగింది.

ఎమ్మెల్యే కార్యాలయం వద్ద ధర్నా

కమ్మ హాస్టల్‌లో సమావేశం పూర్తయ్యాక బాధితులు ర్యాలీగా నరసరావుపేటలోని ఎమ్మెల్యే చదలవాడ అరవింద్‌బాబు కార్యాలయానికి ర్యాలీగా వెళ్లారు. పాలడుగు పుల్లారావుపై వెంటనే చర్యలు తీసుకోవాలని, తమకు న్యాయం చేయాలని నినదించారు. నిందితులకు సహకరించిన సీఐను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. పుల్లారావు కుటుంబ సభ్యులను అరెస్ట్ చేయాలని రోడ్డుపై బైఠాయించారు. ట్రాఫిక్ స్తంభించడంతో సమాచారం అందుకున్న టూటౌన్ సీఐ హైమారావు అక్కడికి చేరుకొని ఆందోళనకారులతో చర్చించారు. అనంతరం బాధితుల వద్దకు ఎమ్మెల్యే అరవింద్ బాబు వచ్చి వారికి నచ్చజెప్పారు. కేసు సీబీసీఐడీకి బదిలీ కాకుండా చూడాలని బాధితుల తరపున కడియాల రమేష్, చేకూరి సాంబశివరావు, యామని రామారావులు ఎమ్మెల్యేను కోరారు. ఆర్థిక అరాచకాలకు పాల్పడిన పుల్లారావు, ఆయన కుటుంబ సభ్యులను వదిలిపెట్టబోమని బాధితులకు హామీ ఇచ్చారు. ఈ విషయాన్ని ఇప్పటికే ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లానని, మరోసారి సీఎం చంద్రబాబుకు తెలియజేస్తానని హామీ ఇచ్చారు. ప్రస్తుతం ఎస్పీ, డీఎస్పీ విచారణ చేపడుతున్నారని తెలిపారు. అనంతరం బాధితులతో కలిసి డీఎస్పీ కార్యాలయానికి వెళ్లి న్యాయం చేయాలని వినతి పత్రం సమర్పించారు. బాధితులను మీడియా పలకరిస్తే ప్రతి ఒక్కరూ తమ కన్నీటి గాథను వినిపించారు.

పొలం అమ్మిన డబ్బులు మొత్తం ఇచ్చేశాం



చేబ్రోలులో ఉన్న పొలం అమ్మి వచ్చిన డబ్బు మొత్తం తెలిసిన వాళ్ల ద్వారా పుల్లారావుకు వడ్డీకి ఇచ్చాం. మా భర్తకు వచ్చిన పీఎఫ్ డబ్బులు కూడా అందులోనే ఉన్నాయి. వడ్డీ అడిగితే నోట్లు రాసిచ్చాడు. కానీ అసలు, వడ్డీ మాత్రం ఇవ్వలేదు. మొత్తం రూ.22 లక్షలు ఇచ్చాం. ఇప్పుడు పిల్లల చదువులకు ఇబ్బందులు పడుతున్నాం. పెళ్లీడుకు వచ్చారు. ఏం చేయాలో తెలియడం లేదు. తలుచుకుంటే దుఃఖం ఆగడం లేదు. ప్రభుత్వం మాకు న్యాయం చేయాలి.

– కోటేశ్వరి, నరసరావుపేట

నమ్మించి మోసం

తండ్రి వాడిలాంటి వాడినని, మీ సొమ్ముకు నేను గ్యారంటీ అన్నాడు. మంచి చేస్తాను అని చెప్పి నమ్మించాడు. నా కూతురు రూ.18 లక్షలు, నేను రూ.15 లక్షలు ఇచ్చాం. వీటిని అప్పు రూపంలోనే పుల్లారావు తీసుకున్నాడు. తీసుకున్న డబ్బుకు నోటు రాసిచ్చాడు. కానీ ఇంత వరకు ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదు. మొత్తం రూ.33 లక్షల వరకు మునిగిపోయాం.

– ఓ బాధితురాలు

ప్రయోగ పరీక్షలపై సీసీ కెమెరాల నిఘా

గుంటూరు ఎడ్యుకేషన్: ఇంటర్మీడియెట్ పబ్లిక్ పరీక్షల్లో భాగంగా ద్వితీయ సంవత్సర సైన్స్ కోర్సుల విద్యార్థులకు సోమవారం నుంచి ప్రారంభం కానున్న ప్రయోగ పరీక్షలు (ప్రాక్టికల్స్)కు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. సోమవారం నుంచి ఈ నెల 20వ తేదీ వరకు గుంటూరు జిల్లా వ్యాప్తంగా 119 కళాశాలల్లోని ఈ ప్రాక్టికల్స్ జరగనున్నాయి. 26,308 మంది ఎంపీసీ, బైపీసీ విద్యార్థులు హాజరు కానున్నారు. ఉదయం, మధ్యాహ్నం రెండు విడతలుగా ప్రాక్టికల్స్ జరగనున్నాయి. జిల్లా వ్యాప్తంగా నాజ్ జంబ్లింగ్ విధానంలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాల్లో నాలుగు ప్రభుత్వ జూనియర్ కళాశాలలు ఉండగా, మిగిలినవి ప్రైవేటు, ఎయిడెడ్ కళాశాలలు. అవకతవకలకు ఆస్కారం లేకుండా ఇంటర్మీడియెట్ బోర్డు అన్ని కేంద్రాల్లో సీసీ కెమెరాలతో నిఘా ఏర్పాటు చేసింది. ప్రతి జిల్లాలోని ఆర్ఐవో కార్యాలయంలోనూ ఈ ఏర్పాట్లు చేశారు. తప్పులు జరిగితే బాధ్యులపై చర్యలు తీసుకునేలా బోర్డు ఏర్పాట్లు చేసింది. ఫీజులు చెల్లించలేదనే కారణంతో విద్యార్థులకు హాల్ టిక్కెట్లు నిరాకరిస్తే బాధితులు నేరుగా బోర్డు వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకునే సదుపాయాన్ని కల్పించినట్లు ఆర్ఐవో జీకే జుబేర్ చెప్పారు. ఫీజు బకాయిలు ఉన్నాయనే సాకుతో హాల్ టిక్కెట్లను నిలిపివేసిన పక్షంలో సంబంధిత ప్రిన్సిపాల్స్‌పై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

క్లుప్తంగా

మారథాన్ పోటీల్లో అబ్దుల్లా ప్రతిభ



వినుకొండ(నూజెండ్ల): రాజస్థాన్‌లో జరిగిన అళ్వార్ టైగర్ టెన్ కిలోమీటర్స్ మారథాన్ పోటీలో పట్టణానికి చెందిన పరుగుల వీరుడు షేక్ అబ్దుల్లా ఏడో స్థానం సాధించారు. హిమాలయ ప్రాంతంలోని లద్దాఖ్‌లో ఫిబ్రవరి 25న మంచు మీద జరిగే గిన్నిస్ బుక్ పరుగుల పోటీల్లో పాల్గొనే యత్నంలో భాగంగా పలు రాష్ట్రాల్లో జరిగే పోటీల్లో పాల్గొంటూ పతకాలు సాధిస్తున్నారు. ఆర్థికంగా, మానసికంగా ధైర్యాన్ని అందించిన గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్ అహ్మద్, గుంటూరు ఈస్ట్ డీఎస్పీ జనాబ్ అజీజ్ భాయ్, డాక్టర్ సాయికృష్ణ, ఎండీ కరీముల్లా, విశ్రాంత ఉద్యోగి షేక్ అప్సర్ భాయ్ అభినందించారు.

పోటీ పరీక్షల్లో విద్యార్థి అల్తాఫ్ ప్రతిభ



అల్తాఫ్

చిలకలూరిపేట: పసుమర్రు ఎంకే జెడ్పీ హైస్కూలు పదో తరగతి విద్యార్థి పఠాన్ మొహమ్మద్ అల్తాఫ్ ఈఈఎంటీ–2025(ఎడ్యుకేషనల్ ఎపిఫని మెరిట్ టెస్ట్)లో జిల్లాస్థాయిలో మొదటి ర్యాంకు సాధించాడు. విజయవాడలోని మాకినేని బసవపున్నయ్య విజ్ఞాన కేంద్రంలో అడిషనల్ డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ వి.ఎస్. మస్తానయ్య నగదు బహుమతి, జ్ఞాపికను అందించారు. స్కూల్ హెచ్ఎం వై. హనుమంతరావు ఆదివారం మాట్లాడుతూ పోటీ పరీక్షలో రాష్ట్రస్థాయిలో మొదటి స్థానంలో సాధించిన విద్యార్థి 100 మార్కులకు 70 సాధిస్తే, మొహమ్మద్ అల్తాఫ్ 66 మార్కులు సాధించినట్లు చెప్పారు. జిల్లా స్థాయిలో మొదటి స్థానంలో నిలవడం గర్వకారణమని తెలిపారు. స్కూల్ కమిటీ చైర్మన్ కోట సుదర్శన్, వైస్ చైర్మన్ గౌసియా, 15,16 వార్డు కౌన్సిలర్లు జాలాది సుబ్బారావు, షేక్ మస్తాన్‌వలి, ఉపాధ్యాయులు షేక్ మొహమ్మద్ యాసిన్ మొహమ్మద్ అల్తాఫ్‌ను అభినందించారు.

మాస్టర్స్ అథ్లెటిక్స్‌లో పలువురికి పతకాలు



బాపట్ల: జాతీయ మాస్టర్స్ అథ్లెటిక్స్ పోటీల్లో బాపట్ల క్రీడాకారులకు పలు పతకాలు దక్కాయి. జనవరి 31 నుంచి ఫిబ్రవరి 3వరకు కేరళలోని త్రిసూర్‌లో జరిగిన పోటీల్లో పలువురికి పతకాలు లభించాయి.70 సంవత్సరాల విభాగంలో ట్రిపుల్‌జంప్‌లో జగదీష్‌కు బ్రాంజ్ మెడల్, 65 సంవత్సరాల విభాగంలో పోల్‌వాల్ట్‌లో కె.శంకరరావుకు బ్రాంజ్ మెడల్, 60 సంవత్సరాల విభాగంలో 100మీటర్ల హార్డిల్స్‌లో బ్రాంజ్ మెడల్, 50 సంవత్సరాల విభాగంలో మురళీ కృష్ణారెడ్డి, ఎం.సురేంద్ర, టి.శ్రీనివాసరెడ్డి, అంజమ్మలు బ్రాంజ్‌మెడల్‌ను సొంతం చేసుకున్నారు. ఈమేరకు వీరిని ఆర్ట్స్ అండ్ సైన్సు కళాశాల అధ్యాపకులు సన్మానించారు.

రహదారులు రక్తసిక్తం

- అవగాహన లేమితో వాహనాలు నడుపుతున్న చోదకులు
- ప్రాణాలు కోల్పోతున్న వైనం

భద్రతా వారోత్సవాలు తూతూమంత్రం



సత్తెనపల్లి: రోడ్డు ప్రమాదాలను నివారించి ప్రజల ప్రాణాలను కాపాడాలనే లక్ష్యంతో రహదారి భద్రత వారోత్సవాలను ప్రతి ఏడాదీ నిర్వహిస్తున్నారు. ప్రమాదాలు జరగకుండా వారం రోజుల పాటు వాహనదారులకు అవగాహన కల్పించడం వారోత్సవాల ప్రధాన లక్ష్యం. అయితే, ప్రస్తుతం జరుగుతున్న 36వ జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాలు నాలుగు గోడలకే పరిమితమయ్యాయి. క్షేత్రస్థాయిలోకి వెళ్లి అవగాహన కల్పించిన దాఖలాలు లేవు. తూతూమంత్రంగా మమ అనిపిస్తున్నారు. కార్యాలయాల్లోనే వారోత్సవాలను నిర్వహిస్తున్నారు. అందులోనూ పట్టణాలకే పరిమితం చేశారు. ఓవైపు భద్రతా మాసోత్సవాలు జరుగుతుండగా మరోవైపు ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి.

ఇటీవల జరిగిన ప్రమాదాలు

- ఈ నెల 7న చిలకలూరిపేట-నరసరావుపేట రహదారిలోని కనపర్తిబావి సమీపంలో ఆటోను లారీ ఢీకొట్టిన ఘటనలో 10 మందికి తీవ్ర గాయాలయ్యాయి.
- అదేరోజు కొండమోడు-పేరేచర్ల జాతీయ రహదారిలోని రెడ్డిగూడెంలో సమీపంలో ఆర్టీసీ బస్సు రెండు ద్విచక్ర వాహనాలను, రెండు కార్లను ఢీకొట్టింది. ఈ ఘటనలో ఇద్దరు మృత్యువాత పడ్డారు.
- నకరికల్లు మండలం అద్దంకి - నార్కెట్‌పల్లి రాష్ట్ర రహదారిపై ట్రాక్టర్‌ను లారీ ఢీకొట్టడంతో ఒకరు మృతి చెందగా మరొకరు తీవ్ర గాయాలపాలయ్యారు.
- నాదెండ్ల మండలం సాతులూరు సమీపంలో లారీ ఢీకొని మహిళ మృతి చెందింది.
- ఆదివారం బొల్లవరం కాలువ కట్టపై జరిగిన ప్రమాదంలో నలుగురు మహిళా కూలీలు మృతి చెందారు.

మొక్కుబడిగా వారోత్సవాలు

జిల్లావ్యాప్తంగా గత నెల 16న 36వ జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాలు ప్రారంభమయ్యాయి. ఈ నెల 15 వరకు నిర్వహించనున్నారు. రవాణా, ఆర్టీసీ, పోలీస్, తదితర శాఖల అధికారుల సమన్వయంతో వారోత్సవాలను నిర్వహిస్తున్నారు. అయితే ప్రారంభం రోజు మినహా మిగిలిన రోజుల్లో పెద్దగా అవగాహన కల్పించి ప్రమాదాల నియంత్రణపై చర్యలు చేపట్టిన దాఖలాలు కనిపించడం లేదు. చిన్న చిన్న కార్యక్రమాలు నిర్వహించి చేతులు దులుపుకొంటున్నారు. గడిచిన వారం రోజుల్లో రహదారులపై రోడ్డు భద్రత వారోత్సవాలు నిర్వహించలేదు. కేవలం నాలుగు గోడలకు పట్టణ పరిధిలోనే పరిమితం చేశారు. దీంతో పూర్తిస్థాయిలో వారోత్సవాలు వాహనదారుల్లోకి వెళ్లలేదు.

లారీలు, ట్రాక్టర్లతోనే ప్రమాదకరం

జిల్లాలో ఇప్పుడు జరుగుతున్న రోడ్డు ప్రమాదాల్లో లారీలు, ట్రాక్టర్లు, కార్లు, ద్విచక్ర వాహనాల ప్రమాదాలే అధికంగా ఉన్నాయి. లారీ డ్రైవర్లకు విశ్రాంతి ఉండదు. సుదూర ప్రాంతాలకు వెళుతుంటారు. కొందరు మద్యం తాగి వాహనాలు నడుపుతుంటారు. ట్రాక్టర్ డ్రైవర్లు నిర్లక్ష్యంగా నడపడం వలన ప్రమాదాలు జరుగుతుంటాయి. హెల్మెట్ ధరించకపోవడంతో వాహన దారులు రోడ్డు ప్రమాదాలకు గురవుతున్నారు.ఈ వారం రోజుల్లోనే ద్విచక్ర వాహనాల ప్రమాదాలు, కారు, ఆర్టీసీ బస్సు, ట్రాక్టర్ బోల్తా పడ్డ ఘటనలు జరిగాయి. నిర్లక్ష్యం వల్లే ఆదివారం బొల్లవరం కాలువ కట్టపై మేజర్ రోడ్డు ప్రమాదం జరిగినట్లు తెలుస్తోంది. రోడ్డు ప్రమాదాలలో అభం శుభం తెలియని ప్రజలు మృత్యువాత పడుతున్నారు.

క్షేత్రస్థాయిలోకి వెళ్లాలి

రోడ్డు ప్రమాదాలను నివారించాలంటే అధికారులు క్షేత్రస్థాయిలోకి వెళ్లాలి. అందులోనూ జాతీయ, రాష్ట్ర రహదారుల వద్ద లారీలు, పెద్ద పెద్ద ట్రక్కులు, బస్సులు, సుదూర ప్రాంతాలకు వెళుతున్న పెళ్లి బృందాలు, విహార యాత్రలకు వెళ్లేవారికి అవగాహన కల్పించాలి. వారోత్సవాలు ముగిసిన తర్వాత అధికారులు భద్రత గురించి పట్టించుకోరు. నెలకోసారి రోడ్డు భద్రత సమావేశాన్ని తూతూమంత్రంగా నిర్వహిస్తారు. అక్కడ అన్ని శాఖల అధికారులు కూర్చుని చర్చించుకుంటారే తప్పా ప్రమాదాల నివారణ చర్యల గురించి పట్టించుకోరు. అధికారులు క్షేత్రస్థాయిలోకి వెళితే తప్పా ప్రమాదాలను నివారించలేం.

వ్యవసాయ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడిగా చక్రవర్తి



కొరిటెపాడు(గుంటూరు): ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యవసాయ ఉద్యోగుల సంఘం అధ్యక్షులుగా కె.పి.చక్రవర్తి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యవసాయ ఉద్యోగుల కార్యవర్గ సమావేశం ఆదివారం గుంటూరులోని కృషి భవన్‌లో నిర్వహించారు. సమావేశంలో ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యవసాయ ఉద్యోగుల కార్యవర్గ సమావేశాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘం అధ్యక్షులుగా కె.పి.చక్రవర్తి, ప్రధాన కార్యదర్శిగా వైవీఎస్ ప్రసాద్, కోశాధికారిగా ఎన్.ఆనంద్‌కుమార్, ఉపాధ్యక్షులుగా పి.రాంబాబు, కుంచాల శ్రీనివాసరావు, విక్టర్ కుమార్, ఐజాక్‌బాబు, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా ఎన్.శ్రీనివాసరెడ్డి, సంయుక్త కార్యదర్శులుగా కాకాని శ్రీనివాసరావు, వై.చెన్నకేశవరావు, కె.రాంబాబు, రాష్ట్ర కౌన్సిల్ మెంబర్‌గా రామలింగేశ్వరరావు, మహిళా విభాగపు కార్యదర్శులుగా ఎస్.అంజలి, కళ్యాణిలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారి హెచ్ రూపేశ్‌కుమార్ నూతన కార్యవర్గం చేత ప్రమాణ స్వీకారం చేయించారు. కార్యక్రమంలో ఏపీ వ్యవసాయ ఉద్యోగుల సంఘం రాష్ట్ర నాయకుడు టీవీ రామిరెడ్డి, అధ్యక్షుడు వి.రఘురామనాయుడు, ప్రధాన కార్యదర్శి కె.వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరాలతో గ్రామీణులకు మేలు

మాజీ మంత్రి అంబటి రాంబాబు



శిబిరాన్ని ప్రారంభిస్తున్న మాజీ మంత్రి అంబటి , పక్కన డాక్టర్ గజ్జల సుధీర్‌భార్గవ్‌రెడ్డి

సత్తెనపల్లి: ఉచిత వైద్య శిబిరాలతో గ్రామీణులకు ఎంతో మేలు జరుగుతుందని రాష్ట్ర మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ గుంటూరు జిల్లా అధ్యక్షుడు అంబటి రాంబాబు అన్నారు. వైఎస్సార్ సీపీ సత్తెనపల్లి నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ గజ్జల సుధీర్ భార్గవ్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం సత్తెనపల్లి మండలం పెదమక్కెనలో గజ్జల నారాయణమ్మ చారిటబుల్ ట్రస్ట్ సౌజన్యంతో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. మాజీ మంత్రి అంబటి రాంబాబు ముఖ్య అతిథిగా హాజరై శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడారు. గ్రామాలలో ఉచిత వైద్య శిబిరాలు జరుగుతున్న సమయంలో ప్రజలు వచ్చి పరీక్షలు చేయించుకోవాలని, దీనివల్ల శరీరంలో రుగ్మతలు నిర్ధారణ అవుతాయని తెలిపారు. ప్రతి ఒక్కరూ సంపూర్ణ ఆరోగ్యవంతులుగా ఉండాలని ఆయన ఆకాంక్షించారు. డాక్టర్ గజ్జల సుధీర్ భార్గవ్ రెడ్డి సీనియర్ వైద్యులని, ఆయన ఎన్నో ఆపరేషన్లు చేశారన్నారు. వారి ఆస్పత్రిలో అన్ని జబ్బులకు వైద్యం చేసే డాక్టర్లు ఉన్నారని తెలిపారు. ప్రతి ఒక్కరూ వైద్య శిబిరాన్ని ఉపయోగించుకోవాలని ఆయన సూచించారు. డాక్టర్ గజ్జల సుధీర్ భార్గవ్ రెడ్డి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలు నిత్యం పొలం పనుల్లో నిమగ్నమవుతుంటారన్నారు. ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించడం వల్ల రుగ్మతలు ఉంటే తెలుస్తాయని, వాటిని ఎలా అధిగమించాలో డాక్టర్ తెలియజేస్తారని చెప్పారు. ఈ సందర్భంగా వైద్యుల బృందం గ్రామస్తులు వివిధ పరీక్షలు నిర్వహించి వారికి అవసరమైన మందులను పంపిణీ చేశారు. ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. కార్యక్రమంలో గుంటూరు మిర్చి యార్డ్ మాజీ చైర్మన్ నిమ్మకాయల రాజనారాయణ, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి పడాల శివారెడ్డి, వైఎస్సార్ సీపీ రాష్ట్ర రైతు సలహా మండలి మాజీ సభ్యుడు కళ్లం విజయభాస్కర్ రెడ్డి, పార్టీ సత్తెనపల్లి మండల అధ్యక్షుడు రాయపాటి పురుషోత్తమరావు, గ్రామ మాజీ సర్పంచ్ ఒద్దుల శ్రీనివాస రెడ్డి, నాయకులు ఒద్దుల రామకృష్ణారెడ్డి, రవీంద్రా రెడ్డి, వెంకటరెడ్డి, లక్ష్మారెడ్డి పాల్గొన్నారు.

కారు ఢీకొని బాలుడికి తీవ్ర గాయాలు

నరసరావుపేట టౌన్ : అతివేగంగా వచ్చిన కారు డ్రైవర్ బాలుడిని ఢీకొన్న సంఘటన ఆదివారం పట్టణంలో చోటుచేసుకుంది. వన్‌టౌన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రామిరెడ్డిపేట పాత పోస్టాఫీస్ సమీపంలో ఇంటి బయట కూర్చొని ఉన్న ఆరేళ్ల బాలుడు రియాన్‌పై అతివేగంగా వచ్చిన కారు ఎక్కింది. ఈ సంఘటనలో అతడి కాళ్లు రెండూ విరిగాయి. కుటుంబ సభ్యులు సమీపంలోని ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ విజయ్‌చరణ్ తెలిపారు.

లారీ డ్రైవర్‌పై చెక్‌పోస్ట్ సిబ్బంది దాడి

నరసరావుపేట రూరల్: లారీ డ్రైవర్‌పై వ్యవసాయ మార్కెట్ కమిటీ చెక్‌పోస్ట్ సిబ్బంది దాడి చేయడంతో ఆదివారం ఉదయం ఎస్ఆర్‌కేటీ కాలనీ జంక్షన్‌లో ఉద్రిక్తత ఏర్పడింది. చెక్‌పోస్ట్ సిబ్బంది చర్యను నిరసిస్తూ లారీ ఓనర్స్, డ్రైవర్లు ఆందోళనకు దిగారు. ధాన్యం లోడుతో ఉన్న లారీ ఆయిల్ కోసం ఎస్ఆర్‌కేటీ పెట్రోల్ బంక్‌లోకి వెళ్తుండగా చెక్‌పోస్ట్ సిబ్బంది ఆపేందుకు ప్రయత్నించారు. ఈ క్రమంలో కర్రతో లారీపై కొట్టారు. డ్రైవర్ లారీని నిలిపి ఎందుకు కర్రతో కొడుతున్నారని ప్రశ్నించాడు. దీనిపై మాటామాట పెరిగి లారీ డ్రైవర్‌పై మార్కెట్ కమిటీ దాడికి పాల్పడ్డారు. విషయం తెలుసుకున్న లారీ ఓనర్స్‌తో పాటు డ్రైవర్లు అధిక సంఖ్యలో అక్కడికి చేరుకున్నారు. చెక్‌పోస్ట్ సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ రోడ్డుపై లారీని నిలిపి ఆందోళనకు దిగారు. హైవేపై వెళ్తున్న లారీల వద్ద డబ్బులు దండుకుంటున్నారని ఆరోపించారు. ఇవ్వని డ్రైవర్లను వేధిస్తున్నారని తెలిపారు. చెక్‌పోస్ట్ సిబ్బందితో పాటు హైవే పెట్రోలింగ్ పోలీసులు, మైనింగ్ శాఖకు చెందిన ఏఎంఆర్ సంస్థ సిబ్బంది కూడా ఈ దందాలో పాల్గొంటున్నారని విమర్శించారు. మార్కెట్ కమిటీ సిబ్బంది లారీ డ్రైవర్‌కు క్షమాపణలు చెప్పడంతో ఆందోళన విరమించారు.

సికింద్రాబాద్‌లో బైట మంజులూరు వాసి మృతి

జె.పంగులూరు: తెలంగాణ రాష్ట్రం సికింద్రాబాద్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో మండల పరిధిలోని బైట మంజులూరు గ్రామానికి చెందిన వ్యక్తి మరణించిన సంఘటన ఆదివారం సాయంత్రం జరిగింది. మృతుని బంధువులు తెలిపిన సమాచారం మేరకు.. బైట మంజులూరు గ్రామానికి చెందిన సరికొండ రవిరాజు (50) గత కొన్ని సంవత్సరాలుగా హైదరాబాదులోని ఓ ప్రైవేటు కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. ఈ నెల 15వ తేదీ రవిరాజు అన్న కుమారుని వివాహం జరగాల్సి ఉండగా.. సికింద్రాబాద్‌లో ఉన్న తన బంధువులకు పెళ్లి కార్డు ఇచ్చేందుకు రవిరాజు, బాబాయి కొడుకుతో కలిసి మోటార్ సైకిల్‌పై సికింద్రాబాద్ బంధువుల ఇంటికి బయలుదేరారు. ప్రమాదవశాత్తు ఎదురుగా వస్తున్న మోటార్ సైకిల్ ఢీ కొట్టడంతో రవిరాజుకు తీవ్ర గాయలయ్యాయి. వెనుక కూర్చొని ఉన్న అతని బాబాయి కొడుక్కి స్వల్ప గాయాలయ్యాయి. రవి రాజును ఆసుపత్రికి తీసుకెళ్తుండగా మరణించినట్లు బంధువులు తెలిపారు. రవిరాజుకు భార్య రమాదేవి, ఇద్దరు ఆడపిల్లలున్నారు.

పెట్టుబడి పేరుతో రూ.48 లక్షలు టోకరా

కేసు నమోదు చేసిన అరండల్‌పేట పోలీసులు

లక్ష్మీపురం: ఆన్‌లైన్ ద్వారా ప్రైవేట్ సంస్థకు పెట్టుబడి పెట్టి రూ.48 లక్షలు మోసపోయిన ఘటనపై బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు అరండల్‌పేట పోలీసులు శనివారం అర్ధరాత్రి కేసు నమోదు చేసిన ఘటన చోటుచేసుకుంది. అరండల్‌పేట పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. భారత్‌పేట 3/1వ లైన్ ప్రాంతానికి చెందిన గరికపాటి నవీన్ ఫార్మా కంపెనీలో పనిచేస్తున్నారు. గతేడాది సెప్టెంబర్ 5వ తేదీన ఆన్‌లైన్ ద్వారా అలియన్స్ ఇన్వెస్ట్‌మెంట్ అనే సంస్థలో పెట్టుబడులు పెట్టడం ద్వారా లాభాలను ఆర్జించవచ్చని మొదట రూ.50 వేలు పెట్టుబడి పెట్టాడు. దానికి తిరిగి ఆ సంస్థ నవీన్‌కు నమ్మకం కలిగేలా కొంత లాభాన్ని కలిపి ఖాతాలోకి జమ చేసింది. అక్కడి నుంచి నవీన్ విడతలవారీగా రూ.48 లక్షల వరకు పెట్టుబడి పెట్టి మోసపోయారు. అరండల్‌పేట పోలీసులకు శనివారం రాత్రి ఫిర్యాదు చేయడంతో వారు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నృత్య పోటీల విజేత నటరాజ గ్రూప్



విజేతలతో ఛత్రపతి కళా పరిషత్ నిర్వాహకులు

సత్తెనపల్లి: ఛత్రపతి కళా పరిషత్ ఆధ్వర్యంలో శ్రీ ఫిరోజి రుషీంద్రుల 136 వ వార్షిక ఆరాధన సందర్భంగా శనివారం రాత్రి నిర్వహించిన రాష్ట్రస్థాయి కూచిపూడి నృత్య పోటీల విజేతగా సత్తెనపల్లి నటరాజ గ్రూప్ నిలిచింది. న్యాయ నిర్ణేతలుగా భరణి, గుంటూరు పద్మశ్రీ , గుంటూరు ప్రియాంక హైదరాబాద్ వ్యవహరించారు. గ్రూప్ విభాగంలో నటరాజు గ్రూప్ (సత్తెనపల్లి) ప్రథమ, తేజస్విని హిరణ్య సాయి (గుంటూరు) ద్వితీయ, అక్షయ గ్రూప్ (సత్తెనపల్లి) తృతీయ స్థానంలో నిలిచాయి. కన్సోలేషన్ బహుమతులను భాను గ్రూప్ (సత్తెనపల్లి), హరిణి (గుంటూరు), లిఖిత (సత్తెనపల్లి) దక్కించుకున్నారు. సోలో విభాగంలో మొదటి బహుమతి హిరణ్య సాయి (గుంటూరు), రెండో బహుమతి తేజస్విని (గుంటూరు), మూడో బహుమతి యునైకా మెహతా 'సత్తెనపల్లి) గెలుచుకున్నారు. కన్సోలేషన్ బహుమతిని తన్విక (సత్తెనపల్లి), ఆదర్శ మెహతా (సత్తెనపల్లి), తేజస్విని (గుంటూరు) కైవసం చేసుకున్నారు. విజేతలకు ఛత్రపతి కళాపరిషత్తు నిర్వాహకులు పులహరి బానోజీ, పి. గోవిందు, కటికే నాగేశ్వరరావు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో నిర్వాహకులు పి.వి. భవానీ ప్రసాద్, ఫిరోజీ, చిన్న, విశ్వనాథ్, రఘు, కౌశిక్ పాల్గొన్నారు.

ఎడ్ల పందేల నిర్వహణ అభినందనీయం

ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు



పందేలను ప్రారంభిస్తున్న ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు



పోటీల్లో పాల్గొన్న ఎడ్లు

మాచవరం: పశుపోషకులను ప్రోత్సహిస్తూ ఎడ్ల పందేలు నిర్వహించడం అభినందనీయమని ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు తెలిపారు. మండలంలోని మోర్జంపాడులో శ్రీలక్ష్మీనరసింహస్వామి 69వ కల్యాణోత్సవం సందర్భంగా నిర్వహిస్తున్న జాతీయ ఒంగోలు జాతి ఎడ్ల బల పదర్శన పోటీల్లో భాగంగా ఆదివారం ఆయన ఆరుపళ్ల విభాగాన్ని ప్రారంభించారు. ముందుగా గ్రామంలోని శ్రీలక్ష్మీనరసింహస్వామిని దర్శించుకొని పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలందరిని సుఖ, సౌభాగ్యాలతో క్షేమంగా కాపాడాలని దేవుని వేడుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఉన్నం నాగమల్లేశ్వరావు, రైతు సేవా సంఘ సభ్యులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

నాలుగు పళ్ల విభాగంలో విజేతలు

చిలుకూరి నాగేశ్వరావు (జె.పంగులూరు, బాపట్ల జిల్లా) ఎడ్లు 4926.2 అడుగుల దూరాన్ని లాగి ప్రథమ బహుమతిని అందుకున్నాయి. నెల్లూరి రామకోటయ్య (కేసానుపల్లి, దాచేపల్లి మండలం, పల్నాడు జిల్లా) ఎడ్లు 4812.9 అడుగులు, అనంతనేని శ్రీకావ్య మధు (యనమలకుదురు,పెనమలూరు మండలం, కృష్ణా జిల్లా) ఎడ్లు 4661.6 అడుగులు, గాదె కిశోర్‌రెడ్డి (మఠంపల్లి, తెలంగాణ) ఎడ్లు 4400 అడుగులు, కత్తి రాజు (వంగపాడు, బెస్తవారిపేట, ప్రకాశం జిల్లా) ఎడ్లు 4190 అడుగులు, కోటా కోటేశ్వరరావు (కేసానుపల్లి, దాచేపల్లి మండలం, పల్నాడు జిల్లా) ఎడ్లు, తుమ్మా థామస్‌రెడ్డి (మండాది, వెల్దుర్తి మండలం , పల్నాడు జిల్లా) కంబన్డ్ జత 4133.9 అడుగులు, దర్శి సాత్విక్ యాదవ్(తుర్లపాడు, చందర్లపాడు మండలం, ఎన్‌టీఆర్ జిల్లా) ఎడ్లు 3806.6 అడుగుల దూరాన్ని లాగి బహుమతులు అందుకున్నాయి.

హ్యాపీ స్కూల్ డేస్



మూడు దశాబ్దాల తర్వాత కలసిన స్వామి స్కూల్ పూర్వ విద్యార్థులు

నరసరావుపేట ఈస్ట్: మూడు దశాబ్దాల అనుబంధం.. నాడు నిక్కర్లతో పాఠశాలకు.. నేడు పిల్లా పాపలతో హాజరు.. ఆత్మీయ ఆలింగనాలు.. గుర్తు చేసుకున్న నాటి తీపి జ్ఞాపకాలతో పూర్వ విద్యార్థుల సమ్మేళనం సందడిగా సాగింది. ప్రకాష్‌నగర్‌లోని స్వామి స్కూల్‌లో 1993–94 విద్యా సంవత్సరంలో 10వ తరగతి చదివిన విద్యార్థులు 30 సంవత్సరాల తరువాత ఆదివారం రామిరెడ్డిపేటలోని ఫంక్షన్ హాల్‌లో కలుసుకున్నారు. ఎక్కడెక్కడో స్థిరపడిన వారంతా చిన్ననాటి మిత్రులను కలుసుకుని రోజంతా సందడిగా గడిపారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన పాఠశాల వ్యవస్థాపకుడు ఈ.ఎం.స్వామి, నాటి ఉపాధ్యాయులు షేక్ షఫీ, సుబ్బారావు, మజీద్, తదితరులు షేక్ బషీర్‌లను ఘనంగా సత్కరించారు.

చేతుల్లోనూ, రేఖల్లోనూ అదృష్టాలు ఉండవు



నగరంపాలెం: తాను చెప్పే మాటల్లో నచ్చనవి వదిలేయాలని, నచ్చిన మాటలను ఆచరించాలని పద్మశ్రీ పురస్కార గ్రహీత, మహా సహస్రావధాని డాక్టర్ గరికపాటి నరసింహారావు అన్నారు. పట్టాభిపురం శ్రీరమా సత్యనారాయణ స్వామి వారి (48) బ్రహ్మోత్సవాలు ఆదివారం రెండో రోజుకి చేరాయి. భారత యుద్ధంలో భగవంతుని పాత్రపై గరికపాటి ప్రసంగిస్తూ ఆచరణను గురువుకి దక్షిణగా ఇవ్వాలని అన్నారు. ప్రతి ఒక్కరిలో తెర వెనుక, ప్రత్యక్షంగా దేవుని పాత్ర ఉంటుందని చెప్పారు. అన్నివేళల్లో మనమందరం అదృష్టవంతులమని అన్నారు. ఎప్పటికప్పుడు అదృష్టవంతులమని, దురదృష్టమని ఎందుకు భావించాలని పేర్కొన్నారు. అదృష్టాలు, దురదృష్టాలు మన చేతుల్లోనూ, రేఖల్లోనూ ఉండవని మన బుద్ధిలో ఉంటాయనేది ప్రతి ఒక్కరూ నమ్మాలని చెప్పారు. మన చేతుల్లోనూ, మనం తీసుకునే నిర్ణయంలో, ఆలోచనలో అదృష్టం ఉంటుందని వివేకానందుడు అంటాడని గుర్తుచేశారు. ఇవన్నీ కూడా అదృష్టమేనని అన్నారు. భారతం రోజుకి గంట చొప్పున ప్రతి ఒక్కరూ చదవాలని చెప్పారు.

అనుమానాస్పదస్థితిలో యువకుడి మృతి



అజయ్(ఫైల్)

రెంటచింతల: స్థానిక చికెన్ దుకాణాల సెంటర్‌లో యువకుడు అనుమానాస్పదస్థితిలో మృతి చెందిన ఘటన ఆదివారం తెల్లవారుజామున జరిగింది. ఎస్ఐ సీహెచ్. నాగార్జున తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామంలోని ఆనందపేటకు చెందిన అనుముల అజయ్(26) సోదరుడైన నవీన్‌తో కలిసి మాచర్ల– గుంటూరు ప్రధాన రహదారి వెంబడి ఉన్న ఓ కిరాణా దుకాణంలో ఐదేళ్ల నుంచి పని చేస్తున్నారు. దుకాణం పైనున్న ఓ గదిలో అజయ్ కొంతకాలంగా అద్దెకు ఉంటున్నాడు. శనివారం రాత్రి మద్యం తాగిన అతడు ఆదివారం తెల్లవారుజామున మత్తులో కిందకు దిగే సమయంలో ఇంటి పైనుంచి కిందపడి తలకు తీవ్రమైన గాయం కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. గురజాల డీఎస్పీ బి.ఎల్.ఎన్. జగదీష్, కారంపూడి సీఐ శ్రీనివాసరావు సంఘటన జరిగిన ప్రదేశాన్ని పరిశీలించారని ఎస్ఐ తెలిపారు. మృతుడి తండ్రి కోటేశ్వరరావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. పంచనామా నిమిత్తం గురజాల ప్రభుత్వ ఆస్పత్రికి మృతదేహాన్ని తరలించినట్లు చెప్పారు. డాగ్ స్క్వాడ్‌ను పిలిపించామని తెలిపారు.

గ్రామస్తుల్లో పలు అనుమానాలు

అజయ్ మృతిపై గ్రామస్తులు పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. శరీరంపై గాయాల గురించి చర్చించుకుంటున్నారు. శనివారం రాత్రి అజయ్ గదిలో ఎంతమంది మద్యం తాగారు...వారు ఏమైనా ఘర్షణ పడ్డారా? అనే విషయాలపై పోలీసులు విచారిస్తున్నారు. అజయ్ చివరి ఫోన్‌కాల్ ఏవరికైనా చేశాడా ? అనే కోణంలో పోలీసులు ప్రత్యేక దృష్టి పెట్టినట్లు సమాచారం.